# శేఖరం

రచన:
సన్నాకుల సుందరరావు

“ఇదిగో డాక్టర్! మీ ఫీజు” రెండు వందల రూపాయ లతడు శేఖర్ గారి చేతిలో పెట్టాడు.

పేపర్‌ను ప్రక్కకుతీసి, డాక్టర్ గారు అతని ముఖాన్ని చూశారు. ఆ చూపులో గంభీరత, ఆశ్చర్యం కన్పిస్తూయుంది.

“ఆలస్యం చేయకండి డాక్టర్” నా భార్య నెలాగైనా బ్రతికించి పుణ్యం కట్టుకోండి. కారే కన్నీటిని తుడుచుకుంటూ దగ్ధకంఠంతో అన్నాడతడు.

మందులపెట్టె తీసికొని, అతనివెంట బయలుదేరాడు డాక్టర్. అతని నడకలో తొందర, ఆవేదన, స్పష్టంగా కన్పిస్తున్నయ్. అతడు పాటుపడిన ఇంట్లోకి దారి తీశాడు. డాక్టర్ కూడా అతన్ని అనుసరించాడు. ఇంట్లో దీపం సన్నగా వెలుగుతూయుంది. “లతా!” ఇదిగో డాక్టర్ గా రొచ్చారు. నీవు బ్రతుకుతావు లతా! అన్నాడతడు,

ఆ మాటలువిని అమె బరువుగా తన నేత్రాలను విప్పి అతనివైపు చూసింది. డాక్టర్! ఆమె నాడీ పరీక్షించాడు. పెట్టెలోనుంచి ఇంజక్షన్ తీసి ఆమెకిచ్చాడు. ఆమె ఒక్కసారి బాధగా మూల్గి, కళ్లు మూసింది. “లతా! లతా!” పిచ్చిగా అరుస్తూ, ఆ యువకుడు ఆమె శరీరంమీదపడి ఏడ్చాడు. డాక్టర్ ఆశ్చర్యంగా అతనివైపు చూడసాగాడు.

డాక్టర్! మీరు మానవులు కాదు. నాకున్న ఒక్క ఆస్తినీ మింగేశారు. నువ్వు మానవుడివి కాదు. చూడు డాక్టర్! చూడు. ఆరుమాసాల ఆ పిల్లాడ్ని. బాగా కళ్ళతో చూడు! వాడికి తల్లి లేకుండా మింగేసావ్? నీవు మనిషివి కాదు. రాక్షసుడివి, అంటూ అరుస్తున్నాడాయువకుడు.”

డాక్టర్ ఆ చంటిపిల్లాడివంక చూశాడు. అతని కళ్లలోనుండి బాష్పబిందువులు రాలాయి. ఆ యువకుడింకా, ఉన్మాదునిలా ఏమిటేమిటో అంటూయున్నాడు. ఆ పిల్లాడు ఎఱ్ఱగా దొండపండులాయున్నాడు. ఆ అరుపులకు ఇంటిచుట్టూ జనం మూగారు. అక్కడనుండి కదలటానికి కాళ్లు రావటం లేదు. అతడు బొమ్మలా నిలుచుండిపోయ్యాడు.

ఇంతలో పోలీసువ్యాన్ యింటిముందు ఆగింది. సబ్ఇనస్పెక్టరు అందులోంచిదిగి ఇంటిలోకి వచ్చాడు. “శేఖరం మీరేనా” ఆయువకుడ్ని సబిన స్పెక్టరు ప్రశ్నించాడు. ఔనన్నట్లు అతను తలఊపాడు. వెంటనే ఇనస్పెక్టరు అతని చేతులకు బేడీలు తగిలించి “లతా! లతా!” అంటూ దుఃఖిస్తూయున్న, అతన్ని బలవంతాన వ్యాన్‌లో ఎక్కించి తీసుకుపోయాడు.

డాక్టర్‌కి వేమీ అర్థంకాలేదు. అతడు తనకి డబ్బు ఇవ్వటం, ఇంటికివచ్చి ఇంజక్షన్ యివ్వటం, ఆమె మరణించటం, పోలీస్‌వ్యాన్‌వచ్చి అతన్ని తీసుకుపోవటం అన్నీ ఒకటివెంబడి ఒకటిగా జరిగిపోయ్యాయి. అతను ఆలోచిస్తూ, తన కోటుజేబులో చెయ్యిపెట్టాడు. రెండు పచ్చనోట్లు అతనిచేతికి దొరికాయి. అక్కడున్న ఓ పెద్ద కర్దది ఇచ్చి పిల్లాడ్ని, ఎత్తుకుని, ఇంటికివెళ్ళిపోయాడతడు.

ఈవిచిత్రసంఘటన అక్కడున్నవారికెవ్వరికీ, అర్థంకాలేదు. డాక్టర్ గారి జాలిబుద్ధిని అంతా మెచ్చుకున్నారు. క్షణకాలంలో ఆమెకు దహనక్రియలు జరిగిపోయాయి. అదంతా డాక్టర్ గారిచ్చిన డబ్బు! అటువంటి ఉదారస్వభావులు చాలా తక్కువని అందరూ తలచారు.

* * * *

డాక్టర్ గారు ఇంటికివెస్తూనే పిల్లాడ్ని ఉమకు అందించారు. ఉమ భర్త మొహంలోకి చూస్తూ, పిల్లాడ్ని ఎత్తుకుంది. డాక్టర్ కుర్చీలో కూర్చొపడ్డాడు.

“ఈ పిల్లా డెవరండీ?” ఉమ కుర్రాడ్ని ముద్దుపెట్టుకుంటూ భర్త నడిగింది.

“ఎవరైతేనేం? ఉమా! ఆ పిల్లాడొక అనాథుడు. మనం ఆ అబ్బాయిని పెంచుకుందామా?” భార్యయొక్క అభిప్రాయాన్ని తెలిసికోటానికి శేఖర్ ఆమె నడిగాడు.

"చాలా బాగున్నాడండి. ఇంతకీ పిల్లాడెవరో చెప్పారుకాదేం" ఉమ భర్తను అడిగింది.

"అదంతా ఒక గాథలే ఉమా!" డాక్టరుగారు దైన్యంగా ఆమె కళ్లల్లోకి చూస్తూ అన్నాడు.

"ఏమిటా గాథ?" అన్నట్లు ఉమ నిరాశగా వస్తున్న అతని మాటల ధోరణినిపట్టి భర్తకళ్ళల్లోకి చూసింది.

ఉమా! నాస్నేహితుణ్ణి నీ వెరుగవు. అతని పేరు రామారావు. తలిదండ్రులు చనిపోయేటప్పటికి చాలాఆస్థి మిగిలింది. అతను నాతోపాటే డాక్టర్ పట్టా పూర్తిచేశాడు. త్వరలోనే ప్రాక్టీసుకూడా పెట్టాడు. అతనికి అభివృద్ధిలోకి రావటానికి గుణాలే తోడ్పడినయ్. బీదలంటే అతని కెంతో ప్రేమ.

భార్యకూడా ఆయన కన్నివిధాలా తగిందే! ఆమె భర్తమాట జవదాటదు. భర్తయొక్క బంధువులు వచ్చినా, స్నేహితులొచ్చినా ఆమె ఎంతగానో గౌరవించేది.

నా కపుడు ఆస్థిపాస్థులేమీ లేవు. ప్రాక్టీసు పెట్టడానికి డబ్బులేదు. నేను రామారావుని అర్థించాను. అతను వేరుమాటేమీ చెప్పకుండా ఆరువేల రూపాయలిచ్చాడు. దానికి ప్రామిసరీనోటు లేదు పత్రమూ లేదు. నోటిమాటనుబట్టి ఆయన ఆ డబ్బు నాకిచ్చాడు.

త్వరలోనే నేనూ ప్రాక్టీసుపెట్టాను. అదంతా అతని చేతివలువ. త్వరలోనే నేనూ వృద్ధిలోకివచ్చాను. మంచిపేరూ! డబ్బూ సంపాదించాను. ఇదంతా మూడు సంవత్సరాలూ జరిగింది. నాలో ఎంతమార్పు వచ్చిందో! అంతమార్పూ రామారావులో వచ్చింది.

అతనికొచ్చేడబ్బు తక్కువ. ఖర్చు యెక్కువ. ధర్మాసుపత్రి పెడితే అతనికే మోసంవచ్చింది. అప్పు లెక్కువయ్యాయి. ఒకవైపు కుమారుడు బి. ఏ. ప్యాసైయ్యాడు. అతనిభార్య అబ్బాయిపెళ్లి చెయ్యాలని పట్టుబట్టింది.

అతనిపెళ్లి ఒక సామాన్యయువతితో గడిచింది. ఆ పెళ్లిఖర్చుకి అతను స్నేహితులినెవర్నీ అర్థించలేదు. ఇల్లు తాకట్టుపెట్టి పెండ్లిచేశాడు. ఆ నవదంపతులను చూస్తూ, భార్యాభర్త లిరువురూ సంతోషించసాగారు. అప్పు అధికం అవటంచేత బాకీదార్లు అతని ఇంటిని స్వాధీనం చేసుకున్నారు. చివరికి వాళ్ళకు మిగిలిందల్లా ఒక పూరిపాక.

తింటానికి వేళకు ఆహారంలేక కృశించసాగారంతా! అంత బ్రతుకూ బ్రతికి తనకీగతి పట్టినందుకు విచారిస్తూ, మనోవ్యాధితో అతను మంచంపట్టాడు.

నే నతడు ఇన్నికష్టాలలో ఉండికూడా నన్ను డబ్బడగకపోవటానికి ఆశ్చర్యం చెందాను. కాని, ఉమా! నే నతని కేలాటి సహాయమూ చెయ్యలేదు.

నేనిపుడు దానిగురించే పాశ్చాత్తాప పడుతున్నాను. ఉమా! నా స్నేహితుడు మనోవ్యాధితో మరణించాడు. అతని ఉత్తరక్రియలకు డబ్బేది? భార్య మిగిలిఉన్న గాజుల్ని అమ్మించి, భర్తకు అన్ని క్రియలు జరిపించింది.

కాని, ఆమె భర్తలేని దిగులూ, తన కొడుకూ, కోడలూ ఉన్న నిస్సహాయతత్వాన్ని చూడలేక పోయింది. బి. ఏ. చదివికూడా తన కుమారుడికి గుమాస్తాగిరి దొరకలేదు. ఎన్ని వస్తువులో ఆమె తాకట్టు పెట్టింది. నగలతో నిండియుండే ఆమె మెడలో మిగిలిందల్లా ఒక పసుపుకొమ్ము మాత్రమే!

ఆమెకూ జబ్బుచేసింది. ఆమెకు నేనే వైద్యం చేశాను. ఎలా? ఒక మానవునిలా కాదు. తల్లిలాంటి ఆమెకు వైద్యం చేయటానికి డబ్బిచ్చేదాకా వెళ్ళే వాడ్ని కాదు. ఆమే మరణించింది. ఇపుడు శేఖరం, లతా నిస్సహాయులు. పుండుమీద కారంచల్లినట్లు లతకీ పిల్లాడు పుట్టాడు.

రెండుప్రాణాలు బ్రతకటమే కష్టమయితే, భగవంతుడు మూడోప్రాణిని సృష్టించాడు. రెండు, మూడు దినాలు ఆహారం లేకుండా గడిపేవారు. అందుచేత లతకు పేగులలో బలంలేక కడుపునొప్పి వచ్చింది. అతనికి ఆపదసమయంలో ఆదుకునే వారెవ్వరూ లేరు. నన్నే అర్థించాడు. కాళ్లా వేళ్లా పడ్డాడు. ఫీజు ఇం పుడైనా ఇస్తానన్నాడు.

నే నామెకు మందిచ్చాను. కాస్త నయమయింది. నాకతడు కృతజ్ఞత తెలిపాడు. కాని; ఉమా! ఆజబ్బు మళ్ళీ తిరగనేసింది. తిరిగి అతడు నాదగ్గరకేవచ్చాడు నేను కతి నుళ్ళా అతనివెంట వెళ్ళటాని కంగీకరించ

లేదు. బాకీఉన్న ఏభైరూపాయలూ అక్కడపెట్టి మరో ఏభైరూపాయలిస్తే వస్తానన్నాను.

అతడు నన్ను దీనవదనంలో ప్రార్థించాడు. నేను వారిసొమ్ముతో ఇంతవాణ్ణయికూడా, అతని ప్రార్థనలు వినలేదు. నాలో మానవత్వం నశించింది. నాలో జాలి అనేది లేశమైనా లేదు. ఖచ్చితంగా నే నీమాట అతనితో చెప్పాను. అతడిక చేసేదేమీలేక వెళ్లిపోయాడు.

నాకేమీ తోచటంలేదు. పేపరు చదువుతూ కూర్చున్నాను. ఒక గంటయ్యే సరికల్లా అతను తిరిగి వచ్చాడు. రెండు వందల రూపాయలనోట్లు నాచేతిలో పెట్టాడు. నే నాశ్చర్యంచెందాను కాని నే నతనికేమీ సమాధానం చెప్పలేదు. అతనివెంట వెళ్ళాను.

లతకు, ఇంజక్షన్ ఇచ్చాను. కాని లాభం లేకపోయింది. నేను ముందేవెళ్తే ఆమె బ్రతికేది. అతనికికతోడెవరూ , లేరు. తన భార్యను కౌగిలించుకుని ఏడ్చాడు. ఆ ఏడ్పులో నన్ను దూషించాడు. నా యొక్క కఠినహృదయాన్ని కరిగించాడు. ఇంతలో పోలీస్‌వ్యాన్ ఇంటిముందు ఆగింది. సబినస్పెక్టర్ శేఖరం నీవేనా, అని ప్రశ్నించాడు. అతడు తల ఊపాడు. వెంటనే బేడీలు తగిలించి అతన్ని తీసుకువెళ్ళారు. అతడు భార్య దహనక్రియల్నికూడా చూడలేకపోయాడు. ఉమా! ఈ పిల్లాడు ఇక దిక్కులేనివాడు. శేఖరం ఏం నేరంచేశాడో తెలీదు. అక్కడొక పెద్ద మనిషికి రెండొందలిచ్చి ఈ పిల్లాడ్ని ఎత్తుకున్నాను. నేనుచేసిన పాపాన్ని పరిహరించుకోటానికి వీడే నాకు స్మారకచిహ్నమయ్యాడు. "ఉమా! దీనికి నువ్వేమంటావు. శేఖర్ ఆ గాథను ముగించాడు."

ఉమ కళ్ళల్లో నీరు తిరిగాయి. ఆమె భర్తకేమీ జవాబు చెప్పలేకపోయింది. కాని ఆమెకు సంతానం లేదు. ఆమె ఆ పిల్లాడ్ని తనివితీరా ముద్దాడింది. డాక్టర్ ఈ దృశ్యాన్ని చూస్తూ; ఆ కుర్చీలోనే నిద్రించాడు.

* * * *

మరునాడు డాక్టర్ హాస్పిటల్‌కు వెళ్ళలేదు. పన్నెండుగంట లయ్యేసరికి కోర్టుకు వెళ్ళాడతడు. ఆ రోజు కేసు విచారిస్తారు. ముద్దాయి కోర్టులోకి రప్పించబడ్డాయి.

"హత్య చెయ్యటానికి గల కారణమేమిటి?" ప్లీడరు ముద్దాయినడిగాడు.

"నా నిరుపేదత్వం! నాభార్యకు జబ్బురావటం! మందుకు డబ్బు లేకపోవటం! అందుచేత నేను కంపార్టుమెంటులోఉన్న కలక్టరుగారమ్మాయి గొంతుపిసికి నెక్లెస్ సంపాదించాను: అది అమ్మి డాక్టర్‌కు ఫీజు ఇచ్చాను" ముద్దాయి 'తనయొక్క స్టేట్‌మెంట్‌ను ఇచ్చాడు.

మేజస్ట్రేటు అతనికి జన్మాంతరద్వీపవాస శిక్ష వేశారు. పోలీసు అతన్ని కారులో ఎక్కించారు. డాక్టర్ అతన్ని సమీపించాడు. "డాక్టర్ ! నా పిల్లాడికి మీరేదిక్కు" అన్నాడతను, "నేను నీ పిల్లాడ్ని పెంచుకుంటున్నాను" అన్నాడు డాక్టర్.

అతని కళ్ళలో కాంతి క్షీణమయింది. ఇంతలో కారు స్టార్టయింది. ఆఖరిసారిగా అతడు డాక్టర్ కళ్ళల్లోకి చూశాడు. నమస్కారం చేశాడు. డాక్టర్ కళ్ళవెంబటి నీళ్లు రాలాయి. కారు వేగంగా కనుచూపుమేర దాటిపోయింది. డాక్టరు కారు వెళ్ళేవరకూ అలాగే నిల్చుని విచారించాడు. బరువుగా కాళ్ళీడ్చుకుంటూ అతడు ఇంటిత్రోవపట్టాడు. ఉమా, శేఖరంలు అతనికి లత ఎడగల ప్రేమకు ఆశ్చర్యపోతూ, పిల్లాడ్ని ముద్దుపెట్టుకున్నారు. ఆ పిల్లాడి మొహంలోనే శేఖరం మొఖమూ, లత మొఖమూ కన్పించింది. డాక్టర్‌గారు కళ్ళవెంబటి రెండు ఆనందబాష్పాలు రాల్చారు.

కామ కళారంగము అనుకోక్కకం.

పటములతో గల పుస్తకము వెల రూ. 1-4-0 పోస్టేజి. 0-10-0. "హింధి విధ్యాబోధని" తెలుగులో గల ఇది సులభముగా హింధీ నేర్చుకొనుటకు తగినది వెల 1-4-0 పోస్టేజీ 0-10-0 రెండూ కొను వారికి పోస్టు ఖర్చు 0-12-0 నేడే వ్రాయండి.

డి. ఎస్. మిత్రా & కో.,

(K) 2, బీటు, సౌకారు పేట, మద్రాసు.